క్లుప్తంగా

2న గుండ్లపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం

నకరికల్లు: గుండ్లపల్లి గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండ్లపల్లి ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని శిబిరాన్ని నిర్వహిస్తున్నామని అసోసియేషన్ ట్రెజరర్ సైదావలి తెలిపారు.

చాగంటివారిపాలెంలో కాఫీ విత్ క్లాప్ మిత్ర



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): చాగంటివారిపాలెం గ్రామంలో కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమం శుక్రవారం జరిగింది. తహసీల్దారు ఎం.భవానిశంకర్, ఎంపీడీవో పి.పుట్టారెడ్డి ఇతర శాఖల అధికారులు పాల్గొని, గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలని సూచించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని సందర్శించి చెత్త వేరు చేయు విధానాన్ని పరిశీలించారు. అనంతరం క్లాప్‌మిత్ర సభ్యులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణప్రవీణ్, వీఆర్వో మాబువలి, పీలా లక్ష్మణ్, పంచాయతీకార్యదర్శి, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు



సత్తెనపల్లి: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే.. కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎస్ రాజకుమారి హెచ్చరించారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌పై సత్తెనపల్లి మల్టీ మెంబరు అప్రోప్రియేట్ అథారిటీ, అడ్వైజరీ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. ఎవరైనా ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే 102, 104 నంబర్లకు ఫోను చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం.పద్మావతి, డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ నాగపద్మజ, ఏరియా వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గారపాడులో కొండ చిలువ కలకలం



పెదకూరపాడు: గారపాడు భాడవలో కొండ చిలువ కలకలం రేపింది. గ్రామానికి చెందిన కుంభ కొండలు, తిరపతిరావు రోజు గొర్రెల మందను గ్రామ శివారులోని ఉన్న గంగమ్మ తల్లి దేవాలయం సమీపంలోని భాడవులకు మేత కోసం తోలుకెళ్తుంటారు. శుక్రవారం మధ్యాహ్నం గొర్రెలు భాడవల్లో ఉంచి గట్టుపై గొర్రెల కాపర్లు నిద్రిస్తుండగా గొర్రెలు ఒక చోట గుంపుగా చేరి అరవడంతో కాపర్లు అప్రమత్తమయ్యారు. మందవైపు వెళ్తుండగా కొండచిలువ ఒక గొర్రెను కాళ్లు మింగే ప్రయతం చేస్తుండటంతో కాపర్లు చేతిలో ఉన్న కర్రలు,రాళ్లతో దానిని కొట్టి చంపారు. కొండ చిలువ 14 అడుగుల పొడవు, 45 కేజీల బరువు ఉంది.

సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- కొత్తబోధనంలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ లబ్ధిని మహిళకు వివరిస్తున్న మంత్రి అంబటి

రాజుపాలెం: మండలంలోని కొత్తబోధనం గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డితో కలసి గడప గడపకు వెళ్లారు. సంక్షేమ లబ్ధిదారులకు అందిన నగదుపై ఆరా తీశారు. సంక్షేమ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి స్థానికులతో మాట్లాడారు. గత నాలుగేళ్లుగా పాదయాత్రలో ఇచ్చిన హామీలను 98 శాతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి చూపించారన్నారు. సంక్షేమం, అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచారని కొనియాడారు. గ్రామంలో 225 కుటుంబాలను సందర్శించి, స్థానికుల సమస్యలను అక్కడికక్కడే మంత్రి అంబటి పరిష్కరించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి రూ.20 లక్షల గ్రాంటు వస్తుందని, వీటితో సీసీ రోడ్డు, మురుగు కాలువల ఆధునికీకరణ, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తామని ఆయన ప్రజలకు వివరించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బాసు లింగారెడ్డి, సర్పంచ్ పాశం మహలక్ష్మమ్మ, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత, జేసీఎస్ మండల ఇన్‌చార్జి పులిబండ్ల అశోక్, వైఎస్సార్ సీపీ నాయకులు పాశం నరసింహారెడ్డి, ఎంపీడీవో టి.శ్రీనివాసరావు, తహసీల్దారు అష్రఫ్ ఉన్నీస్సాబేగం తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం



గర్భిణులకు సీమంతం చేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

రాజుపాలెం: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే ప్రసవం తరువాత తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి అన్నారు. మండల కేంద్రంలోని ఐసీడీసీ ప్రాజెక్టు కార్యాలయంలో పౌష్టిక మాసోత్సవాలలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు, గర్భిణీలకు పోషక పదార్థాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. పౌష్టికాహార పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గర్భిణులు ఎక్కువగా ఆకుకూరలు, కూరగాయలతో కూడిన ఆహార పదార్థాలను తీసుకొని ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఐదుగురు గర్భిణులకు ఎంపీపీ, ఎంపీడీవో, ఎంఈవో మల్లిఖార్జునశర్మ, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతశ్రీనివాసరెడ్డి, తహసీల్దారు అష్రఫ్ ఉన్నీస్సాబేగం సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.శ్రీనివాసరావు, సీడీపీవో టి.శ్రీతల, ఏసీడీపీవో పి.సంతోషకుమారి, సూపర్‌వైజర్లు ఆర్కే రమాదేవి, డి.ప్రసన్నరాణి పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

ముప్పాళ్ళ: తురకపాలెం గ్రామ మాజీ సర్పంచ్ బెల్లంకొండ లూర్దురాజు(78) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. తురకపాలెం గ్రామపంచాయతీకి పదేళ్లపాటు సర్పంచ్‌గా ఆయన పనిచేశారు. దూళిపాళ్ళ ఆంధ్రాబ్యాంక్ సహకార సంఘం డైరెక్టర్ గాను, రాజుపాలెం సమితిలో సభ్యుడిగాను వ్యవహరించారు.

లో లెవల్ చప్టాకు మరమ్మతులు



అమరావతి: పెదమద్దూరు వద్ద వాగు లోలెవల్ చప్టా బుధవారం కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. అధికారులు శుక్రవారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. చప్టా కుంగిచోట సపోర్టుగా మట్టి రాయి పోసి సరిచేస్తున్నారు. అమరావతి-విజయవాడ రహదారిలో ఎడ్ల బండ్లు, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోల రాకపోకలు సాగించటానికి అనుమతిస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బీ ఏఈ సురేష్ మాట్లాడుతూ బ్రిడ్జి పనులు వర్షాల కారణంగా నిలిచిపోయాయన్నారు. మరో రెండు రోజులలో పనులు చేపడతామన్నారు. అలాగే శనివారం కల్లా లోలెవల్ చప్టాకు మరమ్మత్తులు పూర్తిచేసి ఆర్టీసీ బస్సుల రాకపోకలకు అనుమతి ఇస్తామన్నారు.

కంటి రక్షణపై జాగ్రత్తలు పాటించాలి

అచ్చంపేట: కంటి రక్షణకు జాగ్రత్త వహించాలని జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి సూచించారు. కొత్తపల్లిలో మేకల సీతమ్మ, వెంకయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు మేకల సాంబశివరావు ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. జెడ్పీటీసీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శిబిరంలో 224 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్లాల ఆపరేషన్లకు 25మందిని ఎంపిక చేశారు. త్వరలో వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు నిర్వాహకులు మేకల సాంబశివరావు తెలిపారు. గతంలో నిర్వహించిన నేత్రవైద్యశిబిరంలో ఎంపిక చేసిన 150మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నల్లమేకల వెంకటేశ్వర్లు, సర్పంచ్ అయితంరాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

3న పాలిటెక్నిక్ కళశాలలో స్పాట్ అడ్మిషన్లు

క్రోసూరు: మండలంలోని విప్పర్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి కౌన్సిలింగ్ తర్వాత మిగిలిన సీట్లు భర్తీ కోసం అక్టోబర్ 3న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళశాల ప్రిన్సిపల్ రమాదేవీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా కళశాలలో చేరవచ్చునన్నారు. డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్స్, డిప్లొమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్ కోర్సులలో చేరవచ్చన్నారు. స్పాట్ అడ్మిషన్లకు హాజరయ్యే విద్యార్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 95055 04212కు సంప్రదించాలని తెలిపారు.

మాట నిలబెట్టుకున్న ప్రజానేత సీఎం వైఎస్ జగన్

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



పెదకూరపాడు: మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పెదకూరపాడు నియోజకవర్గంలో 5వ విడత వైఎస్సార్ వాహన మిత్ర ద్వారా మొత్తం 952 మంది లబ్ధిదారులకు రూ.95.20లక్షలు లబ్ధిదారుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. చాలీ చాలని రాబడితో డ్రైవర్లు అనేక అవస్థలు పడుతున్నారని వారికి ఆర్థికంగా అండగా ఉండేందుకే వైఎస్సార్ వాహన మిత్ర పథకం ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

మిరపలో ఆకుముడతను వెంటనే అరికట్టాలి



మొక్కలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారుల బృందం

నకరికల్లు: మిరపలో ఆకుముడత అధికంగా కన్పిస్తోందని, నివారణకు క్యాల్షియం నైట్రేట్‌ను లీటరు నీటికి ఐదు గ్రాముల చొప్పున కలిపి ఎకరాకు ఒక కేజీ పిచికారీ చేయాలని ఉద్యాన అధికారి దాసరి నవీన్‌కుమార్ సూచించారు. డీడీఏ డీఆర్‌సీ శివకుమారి, నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, నకరికల్లు, రొంపిచర్ల మండలాల వ్యవసాయాధికారులు కె.దేవదాసు, విజయభాస్కర్ బృందం మండలంలోని కుంకలగుంట, జిల్లాపేటతండాలో మిరప పంటలను శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరప ఆకు కిందిభాగంలో ముడత కన్పిస్తోందన్నారు. నివారణ చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు పి.సాయివెంకట్, వెంకటేష్ పాల్గొన్నారు.

టీడీపీవి అర్థం లేని ఆరోపణలు



పెదమద్దూరు వాగు వద్ద మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అమరావతి: పెద మద్దూరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు సాగుతుండగా మరో పక్క పాత బ్రిడ్జి శిథిలావస్థకు చేరి కుంగిపోతే టీడీపీ నేతలు అర్థం లేని విమర్శలు చేస్తున్నారని డీసీసీబీ బ్యాంకు డైరక్టర్ కోట హరిబాబు అన్నారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి పెదమద్దూరు బ్రిడ్జి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. గతంలో మేళ్ళవాగు ప్రమాదంలో 23 మంది మరణించగా ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మానవత్వంతో ఎండ్రాయి, నరుకుళ్ళపాడు వాగులపై హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి అంచనాలు, పరిపాలన అనుమతులు మంజూరు చేశారన్నారు. జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు షేక్ హష్మీ మాట్లాడుతూ పెద మద్దూరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసి, శంఖుస్థాపన జరిగి సంవత్సరం క్రితం పనులు మొదలు పెట్టారన్నారు. ఇప్పటికే నాలుగు పిల్లర్ల నిర్మాణం పనులు పూర్తయిన టీడీపీ నాయకులకు కనబడకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి మంగిశెట్టి కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నర్సరావుపేట పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి నందూరు కరుణకుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు అళ్ళ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నిత్యం నియోజకవర్గ అభివృద్ధికి కోసం కృషి చేసే ఎమ్మెల్యే శంకరరావుపై విమర్శలు చేయటం మానుకోవాలని, ప్రతిపక్ష నాయకులు మంచి సూచనలు ఇవ్వటం పోయి తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజలే బుద్ధిచెబుతారన్నారు. మండల జేసీఎస్ కన్వీనర్ నాయుడు రాంబాబు, జిల్లా కార్యదర్శి అలా లక్ష్మీనారాయణ నాయకులు చిలకా సాంబయ్య, జాస్తి శ్రీనాథ్, గుబ్బా కృష్ణయ్య, జె.వెంకటరావు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 30న సాయంత్రం 4 గంటలకు, అత్యవసర సమావేశం 4.30 గంటలకు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి శుక్రవారం తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అజెండాల్లోని అన్ని అంశాలపై చర్చించి ఆమోదించడం జరుగు తుందన్నారు. సమావేశానికి ఎక్స్ అఫీషియోగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారన్నారు. అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సెక్షన్ హెడ్లు, హాజరు కావాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో వినాయకుడికి పూజలు

సత్తెనపల్లి: వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా సత్తెనపల్లి పట్టణంలోని వడ్డవల్లి పీర్ల చావడి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడు విగ్రహం వద్ద శుక్రవారం ప్రత్యేక పూజలు భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వి'ద్యుత్ దీపాల అలంకరణతో ఆ ప్రాంతం అంతా పండుగ వాతావరణం సంతరించుకుంది. శుక్రవారం రాత్రి అన్నసంతర్పణ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమ్మవారి సేవలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్

గురజాల : పట్టణంలో వేంచేసియున్న శ్రీ పాటపాటేశ్వరి అమ్మవారిని శుక్రవారం దేవదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవదాయ ధర్మాదాయ శాఖకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.
అనంతరం కమిషనర్‌ను దేవాలయ కమిటీ చైర్మన్ కనకం ఆదినారాయణదత్తు, సభ్యుడు రెంటాల నాగేశ్వరరావు, కార్యనిర్వాహణాధికారి గణపతి సురేష్‌లు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఖోఖోలో క్రోసూరు విద్యార్థినుల ప్రతిభ



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

క్రోసూరు: నియోజవర్గ స్థాయి ఖోఖో పోటీల్లో అండర్- 14 విభాగంలో క్రోసూరు జెడ్పీ పాఠశాల బాలికలు ఎనిమిది మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల హెచ్ఎం రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. క్రోసూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ నెల 27 నుంచి నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ ఆటల పోటీలు జరుగుతున్నాయి. వాటిలో ఖోఖోలో క్రోసూరు జెడ్పీ పాఠశాల బాలికలు ఎనిమిది మందితో పాటు జెడ్పీ విద్యార్థి షేక్ నజీర్ షార్ట్ పుట్ విభాగంలో ప్రథమస్థానంలో, 100, 200 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం సాధించి, జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌కు అర్హత సాధించినట్లు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మేలు



సర్వే చేస్తున్న యూపీహెచ్‌సీ సిబ్బంది

సత్తెనపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని ఏడో వార్డు వైఎస్ఆర్ సీపీ ఇన్‌చార్జ్ దేవరశెట్టి రవికుమార్ అన్నారు. పట్టణంలోని ఏడో వార్డులో శుక్రవారం యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు,వలంటీర్లు ఇంటింటికి ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడే వారిని గుర్తించి వారి చెంతనే మెరుగైన వైద్యం అందించాలని లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ధర్మ, ఏఎన్ఎం ఆయేషా, ఆశా వర్కర్ ఝాన్సీ, వలంటీర్‌సాగర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు గోళ్ళపాడులో వైద్య శిబిరం

ముప్పాళ్ళ: గోళ్ళపాడు గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరుగుతుందని పీహెచ్‌సీ వైద్యురాలు పి.రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో అన్ని రకాల వైద్య సేవలు అందించి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తామన్నారు. గ్రామస్తులుసద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు పెదనెమలిపురిలో వైద్య శిబిరం

రాజుపాలెం: పెదనెమలిపురి గ్రామ సచివాలయం-1 పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో టి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. శిబిరాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రారంభిస్తారని చెప్పారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి అనారోగ్యంతో ఉన్న 651 మందికి టోకెన్‌లు ఇచ్చారని తెలిపారు. శిబిరంలో 14 రకాల రక్త పరీక్షలు అక్కడే నిర్వహించి, ఫలితాలను కూడా ఇస్తారని తెలిపారు. స్పెషలిస్టులైన డాక్టర్‌లు ఇరువురు పాల్గొంటారని, అందులో ఒక్కరు గైనకాలజిష్టు, మరొకరు పిల్లల డాక్టర్, ఇద్దరు పీహెచ్ వైద్యాధికారులు పాల్గొంటారని డాక్టర్ కృష్ణకుమార్ తెలిపారు.

ఘనంగా అమృత కలశ యాత్ర



చేజర్లలో ఎస్‌వీఎస్ఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ర్యాలీ

నకరికల్లు: దేశ పౌరులందరూ నా దేశం-నామట్టి అనే భావన పెంపొందించుకోవాలని ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా అమరులైన వీరులను స్మరించుకుంటూ నామట్టి-నాదేశం కార్యక్రమం ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి శుక్రవారం మండలంలో ప్రారంభించారు. చేజర్ల గ్రామంలోని ఎస్‌వీఎస్ఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్.షాహీం మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా సేకరించిన దేశరాజధానిలో ఢిల్లీలో పవిత్ర అమృత వాటిక నిర్మాణ కార్యక్రమంలో వినియోగిస్తారని అన్నారు. ముందుగా పంచప్రాణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గేరా మోహన్‌రావు, చెరుకూరి వెంకటేశ్వర్లు, ఎస్.లలిత, ఏసీహెచ్.వెంకట్రావు, బత్తుల సుందర్రావు, షేక్.గౌస్, ఎంపీటీసీ సభ్యులు బి.వెంకటరెడ్డి, బి.భాస్కరరెడ్డి, వాలంటరీ ఉపాధ్యాయినీ జి.భారతి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యత

సీనియర్ సివిల్ జడ్జి నాగ వెంకటలక్ష్మి

సత్తెనపల్లి: పరిసరాల పరిశుభ్రత ప్రతి పౌరుని బాధ్యతని సీనియర్ సివిల్ జడ్జి, సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ డి.నాగ వెంకటలక్ష్మి అన్నారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన సదస్సు పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాల్లో శుక్రవారం నిర్వహించారు. న్యాయమూర్తి నాగ వెంకట లక్ష్మి మాట్లాడుతూ కోర్టులో పనుల నిమిత్తం వచ్చే వారికి పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను తెలియ జేయాలన్నారు. న్యాయవాదులు అందరు ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని పిలుపునిచ్చారు. అనంతరం పరిసరాల్లో గోడ ప్రతులను అంటించారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కడియాల ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారురి. లింగారెడ్డి, పలువురు న్యాయవాదులు, గుమాస్తాలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆశయాలను నిర్లక్ష్యం చేయెద్దు



అచ్చంపేట: జగనన్న గోరుముద్ద పథకాన్ని నిర్లక్ష్యం చేయొద్దంటూ జెడ్పీటీసీ సభ్యుడు, జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో కలసి ఆయన భోజనం చేశారు. భోజనం సక్రమంగా ఉడక పోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మెనూ నిర్వహణపై విద్యార్థులతో ముచ్చటించారు. హాజరు శాతం తగ్గడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు చిన్నపరెడ్డి ఉన్నారు.

కన్యక లఘు చిత్రం చిత్రీకరణ



నకరికల్లు: స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శ్రీకాశీ విశ్వేశ్వర పిక్చర్స్ లఘు చిత్రాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించింది. నకరికల్లు, రొంపిచర్ల తహసీల్దార్లు కె.నగేష్, అంకారావు మొదటి దృశ్యానికి క్లాప్ కొట్టారు. దర్శకుడు, నకరికల్లు గ్రామవాసి టి.రాఘవ మాట్లాడుతూ శ్రీకాశీవిశ్వేశ్వర పిక్చర్స్ ఆధ్వర్యంలో కన్యకా అనే పేరుతో లఘుచిత్రాన్ని చిత్రీకరిస్తున్నామని తెలిపారు. నిర్వాహకులుగా కూరపాటి అమర్, ఆతుకూరి సాంబ, కూరపాటి పూర్ణలు వ్యవహరిస్తున్నారన్నారు.
కథానాయకులుగా జాకీర్, ఈశ్వర్, కథానాయకగా మమత నటిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రధానాంశం ఆడవారితో తప్పుగా ప్రవర్తిస్తే తనలో ఉన్న అమ్మవారు బయటకు వస్తుందని తెలిపారు. షూటింగ్ దృశ్యాలను తిలకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పిడుగురాళ్ల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించటం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. ఈ సమావేశం ఉదయం 11 గంటలకు జరుగుతుందని కౌన్సిల్ సభ్యులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన తెలియజేశారు.